: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 37 | 20-06-2022 | పుటలు : 4

# నన్నయ అధ్యాపకులకు సి.ఎ.ఎస్ పదోన్నతులు



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్ (సి.ఎ.ఎస్) పదోన్నతులనిస్తూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉత్తర్వులను అందజేసారు. యూనివర్సిటీ ఈసీ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో విశ్వవిద్యాలయ రెగ్యులర్ అధ్యాపకులకు సి.ఎ.ఎస్ పదోన్నతులనిస్తూ వీసీ ఉత్తర్వులను అందజేసారు. సి.ఎ.ఎస్ ద్వారా ఇద్దరు ఆచార్యులుగా,ఏడుగురు సహాచార్యులుగా, ఐదుగురు సహాయాచార్య స్టేజ్ లలో పదోన్నతులను పొందారు. వీరిలో ఆచార్యులుగా ఆచార్య.డి.జ్యోతిర్మయి, ఆచార్య.కె.రమణేశ్వరిలకు వీసీ సి.ఎ.ఎస్. పదోన్నతి ఉత్తర్వులను అందజేసి అభినందించారు. అలాగే సహాచార్యులుగా

2 లో..



# ఉమెన్ క్రికెట్ సౌత్ జోన్‌లో నన్నయకు మూడోస్థానం

## క్రీడాకారులను అభినందించిన వీసీ



క్రీడాకారులకు సన్మానించి అభినందిస్తున్న వీసీ

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ ఉమెన్ టోర్నమెంట్ 2021-2022లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి మూడో స్థానం దక్కిందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. సౌత్ జోన్ ఉమెన్ క్రికెట్ లో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్న మహిళా క్రీడాకారులను యూనివర్సిటీ ఈసీ హాల్లో వీసీ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి ఐదు రాష్ట్రాలకు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారని, విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ టోర్నమెంట్ లో ఐదు రాష్ట్రాల నుండి 16 మహిళా క్రికెట్ జట్లు పాల్గొన్నా యన్నారు. గట్టిపోటీ నడుమ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్రీడాకారులు చక్కని ప్రతిభను కనబరిచి మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. మద్రాస్ యూనివర్సిటీ ప్రథమస్థానం, మహాత్మా గాంధీ యూనివర్సిటీ కేరళ ద్వితీయ స్థానం సాధించగా మూడో స్థానంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 4 వికెట్ల తేడాతో ఆంధ్ర విశ్వవిద్యాలయంపై విజయం సాధించిందన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మహిళా క్రికెట్ జట్టు మొదటి స్థానంగా ఉందని అభివర్ణించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలకు చెందిన 16 మంది మహిళా క్రికెట్ క్రీడాకారులు ఎంతో చక్కగా తమ ప్రతిభను కనబరిచారని, క్రీడాకారులను ప్రశంసించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో క్రీడాకారులను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంతో ప్రోత్సహిస్తుందని, చక్కని అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఇంజనీర్ డా. కె నూకరత్నం, ప్రిన్సిపాల్ డా. కె. సుబ్బారావు, స్పోర్ట్ బోర్డ్ సెక్రటరీ డా.బి.రామ్ గోపాల్, డా.వి.సాల్మాన్ దేవానంద్, డా.ఫణీంద్ర,డా.మూర్తి, డా.బాలసత్యనారాయణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్

## సంధ్యకు వీసీ ప్రశంసలు



సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ ఉమెన్ టోర్నమెంట్ 2021-2022లో బౌలింగ్ లోనూ బ్యాటింగ్ లోనూ చక్కని ప్రతిభను కనపరచి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలచిన ఉప్పలపాటి సంధ్యను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రశంసించారు. సంధ్య మొదటి లీగ్ మ్యాచ్ లో 28 పరుగులు చేసి 3 వికెట్లు తీశారు. అలాగే సౌత్ జోన్ మ్యాచ్ లో 24 పరుగులు చేసి 2 వికెట్లను తీసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచారు. సౌత్ జోన్ మ్యాచ్ లో ఎంతో ప్రతిభ కనపరిచిన సంధ్యను వీసీ ప్రశంసించి,అభినందించారు.

# సజ్జలను కలిసిన వీసీ జగన్నాథరావు



**14.06.22 (మీడియాసెల్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ప్రభుత్వ సలహాదారు కార్యాలయంలో సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వీసీ శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ జగన్నాథరావు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సాధించిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కోవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కొన్న తీరు, సైకలాజికల్ కౌన్సెలింగ్ సేవలతో ప్రజలకు భరోసా కల్పించడం, వెబినార్లతో విజ్ఞానాన్ని అందించడం, కూలీలకు సామాన్యులకు వసతుల కల్పన వంటి కార్యక్రమాలతో విశ్వవిద్యాలయం ద్వారా మెరుగైన సేవలు అందించామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయానికి కావలసిన ఐ.ఎస్.ఓ,ఏఐసీటీఈ గుర్తింపును సాధించామని, అతి త్వరలో నాక్ లో మంచి గ్రేడ్ ను సాధిస్తామన్నారు. జాతీయ సంస్కృతి మహోత్సవాలు వంటివి విజయవంతంగా నిర్వహించామన్నారు. విద్య, పరిశోధనలకు ప్రాధాన్యమిస్తూ నాణ్యతా ప్రమాణాలను పెంచుతున్నామన్నారు. విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతి నివేదికను సజ్జలకు అందజేశారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని విద్యా, పరిశోధన, సంస్కృతి, క్రీడా, సేవా మరియు వినూత్న కార్యక్రమాల ద్వారా సాధించిన అభివృద్ధి హర్షనీయమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావును ప్రశంసించారు. నన్నయ విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతి నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు.

# సంపాదకీయం




## టీచర్

విద్య సామాజిక రుగ్మతలకు చికిత్స. అధ్యాపకులు భూత కాలాన్ని వర్తమానంతో అన్వయించి భవిష్యత్తుతో కలిపే వారధులు. ఉత్తమమైన అధ్యాపకుల చేతిలో శిక్షణ పొందిన చదువు దివ్యమైనదౌతుంది. టీచర్,విద్యార్థి అధ్యయనం, అధ్యాపనం ఈ రెండిటి ద్వారానే ప్రకాశిస్తారు. సచ్ఛీలం, సత్ప్రవర్తన అనేవి విద్యా ఫలాలు.

బోధన,అధ్యయనాలు కేవలం తరగతి గదులకే పరిమితం కాదు. పుస్తక ప్రపంచంలోంచి ప్రపంచ పుస్తకంలోకి నిరంతరం చూస్తుండాలి. అటువంటి జ్ఞానమే గొప్ప సమాజాన్ని నిర్మిస్తుంది. ఉపాధ్యాయునికి గురువని, అధ్యాపకుడని ఆచార్యుడని వివిధ రకాల పేర్లున్నాయి. ఏ పేరుతో పిలిచినా అతనికి సమాజంతో ఉన్న సంబంధం శాశ్వతం. మంచి ఉపాధ్యాయుడు వెలుగుతున్న దీపం. ఎన్నో దీపాల్ని వెలిగించాలి.

సమాజ మార్గదర్శకుడైన టీచర్ ప్రభావం విద్యార్థిమీద తీవ్రంగా ఉంటుంది. టీచర్ ఆచరణ ఇతరులకుస్ఫూర్తిదాయకమైంది.

'ఆచరణేతి ఇతి ఆచార్యః' అని వ్యుత్పత్తి. ఆచరణ చాలా కీలకమైన అంశం. విద్యార్థిని సృజనాత్మకంగా ఆలోచించే దిశగా నడిపించాలి. స్వతంత్రంగా ఆలోచించేందుకు తగిన పునాదిని వేయాలి. దిశానిర్దేశం చేయగల తాత్వికమైన వ్యక్తిగా తీర్చిదిద్దాలి.

బోధన కేవలం యాంత్రికమైన కలాపంకాదు. కంప్యూటర్, ప్రొజెక్టర్, మెటీరియల్ బోధనోపకరణాలు మాత్రమే. బోధన క్రియాశీలమైన కార్యం. అదొక చైతన్యవంతమైన రూపం. విద్యార్థి మానసిక వికాసానికి చేసే కృషి. తనచుట్టూఉన్న సమాజాన్ని ప్రభావితం చేసే విభిన్నమైన పాత్ర. నేర్పడంతో పాటు నేర్చుకునే గుణం ఉన్న ప్రత్యేకమైన వ్యక్తిత్వం. ఈ లక్షణాలు మాత్రమే టీచర్ ని లోకానికి గొప్పగా పరిచయం చేస్తాయి.

వెనక్కి చూస్తే చరిత్రను ప్రభావితం చేసిన టీచర్లు కనిపిస్తారు. జీవితాన్ని వెలిగించిన,తీర్చిదిద్దిన టీచర్లు దర్శనమిస్తారు. భవనాలు, ఆధునిక సాంకేతిక సౌకర్యాలు గొప్ప విద్యాలయాన్ని సృష్టించలేవు. బోధనని వృత్తిగా మాత్రమే కాక సృజనాత్మక విన్యాసంగా స్వీకరించగలిగిన వారి వల్లనే అది మహోన్నత విద్యాలయమౌతుంది.

బోధన ఒక కళ. బోధన, అధ్యయనాలు ఒక వ్యామోహం. ఉత్సాహ, ఉద్విగ్న భరితంగా తరగతి గదుల్ని సృష్టించే టీచర్లే విద్యార్థులకు గొప్ప మార్గదర్శకత్వాన్ని అందిస్తూ, ప్రేరేపిస్తూ స్ఫూర్తిదాయకంగా వెలుగొందుతారు. జ్ఞానాన్వేషణలో నిత్య విద్యార్థులైన టీచర్లు దేశానికి అనధికార శాసనకర్తలవుతారు.

ఆచార్యదేవోభవ!

# నన్నయ అధ్యాపకులకు సి.ఎ.ఎస్ పదోన్నతులు


సి.ఎ.ఎస్ పదోన్నతులు అందుకున్న అధ్యాపకులతో వీసీ















**(మొదటి పేజీ నుంచి)** డా.బి.జగన్మోహనరెడ్డి, డా.కె.వి.స్వామి, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.పి.విజయనిర్మల, డా.డి.కళ్యాణి, డా.పి.ఉమామహేశ్వరి, డా.బి.కెజియారాణి మరియు సహాయాచార్యులలో స్టేజ్ టూ నుండి త్రీ కి డా.కె.దీప్తి, డా.ఎన్.సజనారాజ్, డా.కె.నూకరత్నం,డా.డి.లత, స్టేజ్ వన్ నుండి టూ కి డా.ఎం.పోచయ్యలకు పదోన్నతుల ఉత్తర్వులను వీసీ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జగన్నాథరావు మాట్లాడుతూ కెరీర్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్ పదోన్నతుల కోసం ఆయా విభాగాలలో నిష్ణాతులైన ఆచార్యులతో ఇంటర్వ్యూలు నిర్వహించామని చెప్పారు. ఆంధ్ర, కృష్ణ, నాగార్జున, జె.ఎన్.టి.యు, అంబేద్కర్ యూనివర్సిటీ ల నుండి అనుభవజ్ఞులైన ఆచార్యులు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సి.ఎ.ఎస్ పదోన్నతులు పొందిన అధ్యాపకులు ఎంతో చక్కగ ఇంటర్వ్యూలలో ప్రతిభను కనపరిచారని తెలిపారు. సి.ఎ.ఎస్. ద్వారా ఆచార్యులుగా, సహాచార్యులుగా పదోన్నతులు పొందిన వారంతా విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిశోధనలపై దృష్టి సారించాలని ప్రతీ ఒక్కరు అంతర్జాతీయ పరిశోధనల పత్రాలను ప్రచురించాలని తెలియజేసారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. సి.ఎ.ఎస్ పదోన్నతులతో రెట్టింపు ఉత్సాహంతో విశ్వవిద్యాలయ శ్రేయస్సు కోసం పని చేయాలని సూచించారు. అనంతరం చాలా కాలంగా ఎదురు చూస్తున్న సి.ఎ.ఎస్ పదోన్నతులను అందజేసిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావును విశ్వవిద్యాలయ అధ్యాపకులు శాలువాతో సన్మానించి ధన్యవాదాలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, డీన్స్ ఆచార్య. పి.సురేష్ వర్మ, ఆచార్య వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.












# ఇంజనీరింగ్ అధ్యాపకురాలు మౌనికకు పి.హెచ్.డి. ప్రదానం



పి.హెచ్.డి.పట్టాను అందజేస్తున్న వీసీ జగన్నాథరావు

**17.06.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లోని సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు గా పనిచేస్తున్న కె.సాయి సత్య మౌనిక ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టాను పొందారు. శుక్రవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ కార్యాలయంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు చేతుల మీదగా మౌనిక పి.హెచ్.డి. పట్టాను అందుకున్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జగన్నాథరావు మార్గదర్శకత్వంలో పరిశోధన పూర్తి చేసారు. మౌనిక "జియాలజీ, డిపాజిషనల్ అండ్ ఎరోషనల్ డైనమిక్స్ ఆఫ్ కోస్టల్ సెడిమెంట్స్ ఆఫ్ హెూలోసీన్ నుండి రీసెంట్ వరకు, విశాఖపట్నం–భీమునిపట్నం తీరం, ఆంధ్రప్రదేశ్, ఈస్ట్ కోస్ట్ ఆఫ్ ఇండియా" అనే అంశంపై పరిశోధన చేసారు. ఆమె విశాఖపట్నం–భీమునిపట్నం తీరం వెంబడి బీచ్ అవక్షేపాల కోత, నిక్షేపణ ధోరణిని అధ్యయనం మరియు కోత యొక్క హాని కలిగించే పాయింట్లను గుర్తించారు. తీరప్రాంత భూస్వరూప లక్షణాలు బీచ్ ప్రక్రియపై నియంత్రణను కలిగి ఉన్నాయని ఆమె గుర్తించారు. ఈ తీరం వెంబడి ఎర్రటి అవక్షేపాల మూలాన్ని వివరించడానికి ఒక కొత్త సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువచ్చారు. పిహెచ్.డి. అందుకున్న మౌనికను వీసీ జగన్నాథరావు ప్రశంసించారు. అలాగే రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ఓఎస్డి ఆచార్య ఎస్. టేకి, ప్రిన్సిపల్ డా.వి.పెర్సిస్, కోర్సు కోఆర్డినేటర్ శ్రీవర్మ అభినందనలు తెలిపారు.

# డిగ్రీ 5 వ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసిన వీసీ




పరీక్ష ఫలితాలు విడుదల చేసిన వీసీ జగన్నాథరావు

ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 5 వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విడుదల చేశారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ ఉమ్మడిగోదావరి జిల్లాల్లోని డిగ్రీ 5వ సెమిస్టర్ బిఏ, బికామ్, బిబిఏ, బిఎస్సీ, బిసిఏ, ఒకేషనల్ కోర్సులలో మొత్తం 27,310 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసారని వారిలో 17,998 ఉత్తీర్ణులు అయ్యారని ఉత్తీర్ణత శాతం 65.90 గా ఉందని తెలిపారు. పరీక్ష ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్సైట్ www.aknu.edu.in ద్వారా పొందవచ్చునని అన్నారు. కొవిడ్ సమయంలో సమర్థవంతంగా మూల్యాంకనం చేసి ఫలితాలు అందించిన విశ్వవిద్యాలయ పరీక్షా విభాగ అధికారులను, సిబ్బందిని వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, డీన్ ఎగ్జామినేషన్స్ డా.ఎ.మట్టారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డా.ఎ.విజయ కుమారి,ఫ్యాకల్టీ అసోసియేట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రావిశాస్త్రి సాహిత్య సమాలోచనం (జాతీయ సదస్సు)

## రావిశాస్త్రి శతజయంతి

## (1922-2022)




## పుస్తకం




తెలుగు సాహిత్యంతో ఏ కాస్త పరిచయమున్నవారికైనా పరిచయం అవసరంలేనిపేరు రావిశాస్త్రి. రావిశాస్త్రిగా సుపరిచితుడైన రాచకొండ విశ్వనాథశాస్త్రి 1922 వ సంవత్సరం జూలై 30 వతేదీన జన్మించారు.రావిశాస్త్రి శతజయంతి సంవత్సరమిది. ఉత్తరాంధ్ర మాండలికంలో, అట్టడుగు వర్గాల భాషలో అత్యంత ప్రతిభావంతంగా,హితేన సహితః సాహిత్యం అనే దానిని నిజంచేస్తూ సాహిత్యాన్ని సృష్టించిన సాహితీవేత్త రావిశాస్త్రి.ఆ మహనీయుని సాహిత్యాన్ని, సాహిత్యంలోని లోతులను నేటి సమాజానికి అన్వయిస్తూ శతజయంతి సంవత్సర సందర్భంలో పునర్మూల్యాంకనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని, ఇది నేటి సమాజానికి అవసరం అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ భావిస్తోంది.అందుకే రావిశాస్త్రి శతజయంతి సందర్భాన్ని పురస్కరించుకొని "రావిశాస్త్రి సాహిత్య సమాలోచనం" పేరుతో రెండురోజుల జాతీయ సదస్సు నిర్వహించాలనే సంకల్పంతో మీ ముందుకొచ్చింది.

రావిశాస్త్రిది తెలుగు సాహిత్యంలో విశిష్టమైన స్థానం. విభిన్న వస్తువులతో నవల, కథానిక, నాటికలు, నాటకాలు మనకందించిన రావిశాస్త్రి వృత్తిరీత్యా న్యాయవాది. ఈ క్రమంలోనే ఈయన కాంగ్రెస్ వాదిగా ఉన్న దశనుంచి కమ్యూనిస్టుగామారి, విరసం స్థాపకుల్లో ఒకరయ్యారు. సాహిత్యంలో దీనులను ఉద్ధరించడానికి ప్రయత్నించినతీరును ఈయన సాహిత్యంలోని పాత్రల ద్వారా గమనించవచ్చు.

1952లో రాసిన 'అల్పజీవి' నవలతోనే తనదైనముద్రను చూపించి జేమ్స్ జాయిస్ చైతన్యస్రవంతిని తెలుగువారికి పరిచయం చేశాడు. ఈ నవల తెలుగులో వచ్చిన నవలల్లో ఎన్నదగిన అతితక్కువ వాటిలో ఒకటిగా విమర్శకుల ప్రశంసలు పొందిన విషయం మనకందరికీ సుపరిచితమే.

రాజు మహిషి, రత్తాలు–రాంబాబు అనే రెండు అసంపూర్ణ నవలలతోపాటు ఈయన జీవిత చరమాంకంలో ఇల్లు అనే నవలను రచించాడు. వీటితోపాటు కథాసాగరం , ఆరుసారా కథలు, రాచకొండ కథలు,కలకంఠి , బానిస కథలు , ఋక్కులు , ఆరు చిత్రాలు , సొమ్ములు పోనాయండి, గోవులొస్తున్నాయి జాగ్రత్త, బంగారం, ఇల్లు వంటి కథాసంపుటిలతోపాటు ప్రఖ్యాతి చెందిన 'నిజం' నాటకం , తిరస్కృతి, విషాదం వంటి నాటికలను రాశారు.

'రావిశాస్త్రి శతజయంతి సదస్సు' ను జూలై నెలలో సెమినార్ / వెబినార్ గా నిర్వహించాలని నిర్ణయించాం.(మీ వీలునుబట్టి పాల్గొనే అవకాశం ఉంటుంది) సదస్సు తేదీలను త్వరలో ప్రకటిస్తాం.

గతంలో దేవరకొండ బాలగంగాధర తిలక్ శతజయంతిని మొదటిసారి నిర్వహించినట్టుగానే ఇప్పుడు రావిశాస్త్రి శతజయంతి సదస్సును నిర్వహిస్తున్న సందర్భంలో గతంలో మేము నిర్వహించిన సదస్సులను విజయవంతం చేసినట్లుగానే ఈ శతజయంతి సదస్సును విజయవంతం చేయడంలో మీరూ భాగస్వాములు కావాలని ఆహ్వానిస్తున్నాం.రావిశాస్త్రి సాహిత్యాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషిస్తూ పరిశోధన వ్యాసాలు రాయాలని కోరుతున్నాం. మీ పరిశోధన వ్యాసాలను జూన్ 30 వతేదీలోపుగా raavisastry101@gmail.com మెయిల్ కు పంపించాల్సిగా కోరుతున్నాం. ప్రామాణిక వ్యాసాలను ISBN తో సెమినార్ ప్రొసీడింగ్స్ గా తీసుకువస్తామని తెలియజేస్తున్నాం. ధన్యవాదాలు!

**డా.కేవీయన్డీ వరప్రసాద్, సదస్సు సంచాలకులు,**
**తెలుగు శాఖాధ్యక్షులు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.**

# కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**17.06.22 (మీడియాసెల్)**

ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో నాణ్యమైన విద్యను అందించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. శుక్రవారం యూనివర్సిటీ ఈసీ హాల్లో యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలకు సంబంధించి మునుపటి తీర్మానాలను సమీక్షించారు. అనుబంధ కళాశాలల్లో బోధన నాణ్యతను మెరుగుపరిచేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో విద్యార్థులందరికీ నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు అనుబంధ కళాశాలలు కృషి చేయాలన్నారు. ఆయా కళాశాలల నాణ్యత ప్రమాణాలు, పనితీరు స్వీయ అసెస్మెంట్ ఫార్మాట్ రూపకల్పన చేయాలన్నారు. తరగతులు నిర్వహణపై తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. అలాగే ఆయా కళాశాలల పనితీరు తరగతుల నిర్వహణ వంటి అంశాలను విశ్వవిద్యాలయ అధికారులు సాంకేతిక పరిజ్ఞానంతో పరిశీలించాలన్నారు. లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టం (ఎల్.ఎమ్.ఎస్) ద్వారా సుమారు మూడు వేల పైగా డిగ్రీ పీజీ లోని ఆయా పాఠ్యాంశాలకు సంబంధించిన వీడియో లెక్చర్లను ఆన్లైన్ ద్వారా యూనివర్సిటీ వెబ్సైట్లో అందుబాటులో ఉంచనున్నారు. నాణ్యమైన ఆన్లైన్ వీడియో లెక్చర్లను కళాశాలలు, విద్యార్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అలాగే అనుబంధ కళాశాలలో నూతన జాతీయ విద్యా విధానం అమలును పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ఓ.ఎస్.డి ఆచార్య ఎస్.టేకి, డీన్ ఎగ్జామినేషన్ డా.ఎ.మట్టారెడ్డి, సిడిసి డీన్ డా.పి.వెంకటేశ్వరరావు, ఫ్యాకల్టీ అసోసియేట్స్ డా.పి.రాజశేఖర్, డా.జి.కీర్తిమరిట పాల్గొన్నారు.

## మంచి మాట



విశ్వాసం, ఋజువర్తనం, శ్రద్ధాభక్తులు ఉన్నంతవరకు విజయం కలగడం ఖాయం.

*So long as you have faith and honesty and devotion, everything will prosper.*

- స్వామి వివేకానంద

# ఆచార్య జగన్నాథరావుకు సాంబయ్య అవార్డు ప్రదానం



**18.06.22 (మీడియాసెల్)**

విద్యా ప్రదాత సీహెచ్ సాంబయ్య స్మారక అవార్డును ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం (రాజమహేంద్రవరం) ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావుకు ప్రదానం చేశారు. తెనాలిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యాప్రదాత సీహెచ్ సాంబయ్య వర్ధంతి నిర్వహించారు. ఖాజీపేటకు చెందిన విద్య , వైద్య , వైజ్ఞానిక కళాసేవాసమితి ' సీహెచ్ సాంబయ్య స్మారక పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన సెయింట్ మేరీస్ గ్రూపు విద్యాసంస్థల చైర్మన్ కేవీ కృష్ణారావు చేతులమీదుగా అవార్డును ప్రదానం చేశారు . నరేంద్ర రామానుజదాస స్వామీజీ జ్యోతి ప్రజ్వలన చేశారు. 2022 మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులను అభినందించారు . విద్యాదాత అయిన తండ్రి మరణించి 33 సంవత్సరాలవుతున్నా ఆయన జ్ఞాపకార్థం సత్కార్యాలు నిర్వహించటం ముదావహమని స్మారక పరిషత్ వ్యవస్థాపకుడు సీహెచ్ భాస్కర్ ను పలువురు అభినందించారు.

